భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ

భద్రాచలం, మార్చి 28: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు శుక్రవారం సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపచేశారు. ఉత్సవ మూర్తులకు బేడా మండపంలో కల్యాణం నిర్వహించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

భద్రాచలం, మార్చి 28: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి మహారాష్ట్ర రాష్ట్రంలోని థాణే ప్రాంతానికి చెందిన భక్తులు పవన్‌కుమార్-కామాక్షి దంపతులు శుక్రవారం రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఈ నగదును సూపరింటెండెంట్ సాయిబాబా స్వీకరించారు.

ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో

భద్రాచలం, మార్చి 28: ఐటీడీఏ ప్రాంగణంలోని గెస్ట్ హౌస్, గిరిజన భవనంలో విద్యుత్ సమస్య నివారణకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేయించారు. దీనిని ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం ప్రారంభించారు. శ్రీరామ నవమికి ముఖ్యమంత్రి రానున్నందున పర్యటిస్తున్నందున గెస్ట్ హౌస్‌కు ఏవైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే చేయించాలని, వీఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏపీవో (జనరల్) డేవిడ్‌రాజ్, ఏపీవో (పవర్) వేణు, ఏటీడీవో అశోక్‌కుమార్, టీఏ శ్రీనివాస్, ఏఈ రవి, డీఈ జీవన్‌కుమార్, ఏఈ దుర్గాప్రసాద్, సబ్ ఇంజినీర్లు రాజారాం, చలపతి పాల్గొన్నారు.

ట్రైకార్ యూనిట్లు అందజేత

భద్రాచలం, మార్చి 28: ట్రైకార్ గ్రామీణ రవాణా పథకం కింద సబ్సిడీతో పాల్వంచ మండలానికి చెందిన జరపల లాల్‌సింగ్‌కు, టేకులపల్లి మండలానికి చెందిన బానోత్ అశోక్‌కుమార్‌కు నాలుగు చక్రాల వాహన యూనిట్లను ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో అందించారు. ఏపీవో (జనరల్) డేవిడ్‌రాజ్, ఇన్‌చార్జ్ ఎస్‌వో భాస్కర్, డీఎస్‌వో ప్రభాకరరావు పాల్గొన్నారు.

భద్రాద్రి దేవస్థానం నిర్వాసితులకు పరిహారం

చెక్కులు ఇస్తున్న ఆర్డీవో దామోదరరావు

భద్రాచలం, మార్చి 28: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం మాడ వీధుల విస్తరణ, అభివృద్ధిలో భాగంగా పరిసరాల్లోని ఇళ్లు, భూములను కొందరు కోల్పోయారు. ఆ నిర్వాసితులకు దేవస్థానం నుంచి మంజూరైన పరిహారం చెక్కులను ఆర్డీవో దామోదర్‌రావు శుక్రవారం తన కార్యాలయంలో పంపిణీ చేశారు. మొత్తం 40 కుటుంబాలకు రూ.34.45 కోట్లు మంజూరయ్యాయి. వారిలో 17 కుటుంబాలకు రూ.10.82 కోట్లను శుక్రవారం పంపిణీ చేశారు. మిగతా వారికి శనివారంలోగా పంపిణీ చేస్తామని ఆర్డీవో తెలిపారు.

డీఎస్పీ కార్యాలయం ఏర్పాటుకు వినతి

అశ్వారావుపేట, మార్చి 28: అశ్వారావుపేట నియోజకవర్గ మండలాలకు ప్రత్యేకంగా డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లో వినతిపత్రం ఇచ్చారు. అశ్వారావుపేట పోలీస్ సర్కిల్ కార్యాలయంతోపాటు ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు మరో సర్కిల్ కార్యాలయం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఓబీలో రికార్డ్ తిరగరాసిన పీకే ఓసీ-2

మణుగూరు టౌన్, మార్చి 28: మణుగూరు ప్రకాశం ఖని(పీకే) ఓసీ-2 గని.. ఓబీలో రికార్డు సృష్టించింది. గురువారం ఒక్క రోజులోనే ఒక లక్ష నాలుగువేల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్(ఓబీ) తీసి మరోసారి సత్తా చాటింది. సాధారణంగా మూడు షిప్టుల్లో కలిపి రోజువారీ లక్ష్యం 62వేల క్యూబిక్ మీటర్లు ఉంటుంది. కానీ, గురువారం 22.5 గంటల్లో 1.4 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తీసిన మైన్‌గా పీకే ఓసీ-2 రికార్డ్ సృష్టించింది. 2021 మార్చి 30న 1.01 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తీసిన రికార్డును ఈ ఓసీ నెలకొల్పింది. తాజాగా, తన రికార్డును తానే గురువారం రోజున అధిగమించింది.

బీజాపూర్‌లో మందుపాతర నిర్వీర్యం

మావోయిస్టుల కుట్రను భగ్నం చేసిన భద్రతా బలగాలు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 28 : భద్రతా దళాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతను గుర్తించిన బలగాలు దానిని నిర్వీర్యం చేశారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఆర్‌పీఎఫ్ 222 బెటాలియన్ జవాన్లు ఏరియా డామినేట్ చేస్తున్నారు. ఈ క్రమంలో చెర్పాల్-పల్నార్ మధ్య రహదారిపై మావోయిస్టులు అమర్చిన 45 కేజీల ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్(ఐఈడీ)ని జవాన్లు గుర్తించారు. అధికారుల సమాచారంతో వెంటనే అక్కడికి చేరుకున్న బాంబ్ స్క్వాడ్ మందుపాతరను చాకచక్యంగా బయటకు తీసి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి పేల్చివేసి మావోయిస్టుల కుట్రను భగ్నం చేశారు. మందుపాతర అమర్చిన 150 మీటర్ల దూరంలో దానిని పేల్చివేసే స్విచ్ కూడా ఉన్నట్లు జవాన్లు గుర్తించారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

ఐఈడీ పేలి జవాన్‌కు గాయాలు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా ఖోకమేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుతుల్-బెద్మకోటి రహదారిలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి బస్తర్ ఫైటర్స్‌కి చెందిన ఓ జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. తోటి జవాన్లు వెంటనే తేరుకుని క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందింది హుటాహుటిన జిల్లా కేంద్రానికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
CHANGE OF NAME
★I, **NEELAM AGARWAL,** D/o. Late PARMANANDA AGARWAL Resident of Hyderabad now known as **NEELAM GOYAL,** W/o. ANKITH GOYAL Resident of Yellandu. Any Objection : 9985910123
KMM -

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రశాంతంగా ముగిసిన సైన్స్ పరీక్ష-1

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, మార్చి 28: జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం సైన్స్ పేపర్-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో వెంకటేశ్వరచారి తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 12,273 మందికిగాను 12,238 మంది విద్యార్థులు హాజరయ్యారని, 35 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. సప్లిమెంటరీ విద్యార్థులు 472 మందికి గాను 427 మంది విద్యార్థులు హాజరయ్యారని, 45 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా పరిశీలకుడు విజయలక్ష్మీబాయి నాలుగు సెంటర్లను, డీఈవో వెంకటేశ్వరచారి మూడు సెంటర్లను, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 17 సెంటర్లను తనిఖీ చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్

టేకులపల్లి వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

బూర్గంపహాడ్ డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

టేకులపల్లి/బూర్గంపహాడ్, మార్చి 28 : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు సంబంధించి జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, ఎస్ఎల్ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, డీఏ, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా కమిటీ పిలుపు మేరకు భద్రాద్రి జిల్లా టేకులపల్లి, బూర్గంపహాడ్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఉపాధ్యాయులు శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పలువురు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతోపాటు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడు పాదిలి సత్యనారాయణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పీఆర్‌టీయూ రాష్ట్ర మహిళా కార్యదర్శి పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబూరావు, వై.ప్రకాశ్, విజయనిర్మల, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్, రామారావు, రవీందర్, నాయకులు మోతీలాల్, రమేశ్‌బాబు, బాలు, పద్మజ, రమేశ్, కిషన్‌రావు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురుల బరితెగింపు

- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోబోయిన అటవీ అధికారులు..
- వారి మీదకు దూసుకొచ్చిన ఇసుక ట్రాక్టర్లు
- తప్పించుకున్న అధికారులు

గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

టేకులపల్లి, మార్చి 28: మండలంలో ఇసుకాసురులు శుక్రవారం బరితెగించారు. ఏకంగా, అటవీ అధికారుల మీదకు ఇసుక ట్రాక్టర్లతో దాడికి దూసుకొచ్చారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హారిక తెలిపిన వివరాలు.. మండలంలోని చంద్రుతండా వద్ద శుక్రవారం ఇది జరిగింది. మండలంలోని శంభూనిగూడెం మొర్రేడు వాగు నుంచి అటవీ ప్రాంతం మీదుగా చంద్రుతండాకు చెందిన ఐదు ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హారిక ఆధ్వర్యంలో సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆ ట్రాక్టర్లను చంద్రుతడా వద్ద ఆపేందుకు ప్రయత్నించారు. ట్రాక్టర్లను డ్రైవర్లు ఆపకపోగా, ఆ అధికారులను (ట్రాక్టర్లతో) ఢీకొట్టేందుకు ప్రయత్నించారు. దీనిని పసిగట్టిన సెక్షన్ ఆఫీసర్ హారిక, సిబ్బంది చాకచక్యంగా పక్కకు తప్పుకున్నారు. ఆ ట్రాక్టర్లు ఆగకుండా వెళ్లిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న కొత్తగూడెం ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్, డీఆర్‌వో తోలెం వెంకటేశ్వర్లు తదితరులు కలిసి చంద్రుతండాకు చేరుకున్నారు. నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు అడ్డుకుని ఘర్షణకు దిగారు. అటవీ ప్రాంతాల మీదుగా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలుంటాయని ఆ గ్రామస్తులను అధికారులు హెచ్చరించారు.

కేసు నమోదు

తమ విధి నిర్వహణను ఆటంకపరిచారని, దూషించారని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హారిక ఇచ్చిన ఫిర్యాదుతో ఐదుగురిపై ఎస్సై పోగుల సురేశ్ శుక్రవారం కేసు నమోదు చేశారు. రెండు చోట్ల రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. చంద్రుతండాకు చెందిన పవన్‌పై, శంభునిగూడేనికి చెందిన సురేష్‌పై కేసు నమోదు చేశారు.

మిషన్ భగీరథ కార్యాలయం ముట్టడి

గుడిసెవాసులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం డిమాండ్


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కాలనీవాసులు

ఇల్లెందు రూరల్, మార్చి 28 : మండలంలోని సీఎస్పీ బస్తీ రాజీవ్ నగర్ కాలనీలోని గుడిసెవాసులకు తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఇల్లెందు మండలంలోని కోరగుట్టపై ఉన్న మిషన్ భగీరథ కార్యాలయాన్ని కాలనీవాసులు శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు అబ్దుల్ నబి మాట్లాడుతూ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నాలుగు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దీనికి నిరసనగా తొలుత మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించి అనంతరం కోరగుట్టపై ఉన్న మిషన్ భగీరథ కార్యాలయాన్ని ముట్టడించారు. తర్వాత ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, వజ్జ సురేశ్, వీరభద్రం, వెంకన్న, కౌసల్య, కోటమ్మ, భవాని, రసూల్ బీ, వైకుంఠ, హుస్సేన్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా 'చంద్ర'

జూలూరుపాడు, మార్చి 28: తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన చంద్ర నరేంద్రకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 25 నుంచి 27 వరకు నిజామాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర మూడో మహాసభల్లో సంఘం ప్రతినిధులు ఆయనను ఎన్నుకున్నారు.

సంత, డైలీ మార్కెట్, కబేళాకు వేలంపాట

కొత్తగూడెం అర్బన్, మార్చి 28: పట్టణంలోని వారాంతపు సంత, రోజువారీ మార్కెట్, కబేళాల నిర్వహణకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంపాటలో డైలీ మార్కెట్‌ను శీలం శేఖర్ రూ.23.50 లక్షలకు కైవసం చేసుకున్నారు. వారాంతపు సంతకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఎవరూ టెండర్ వేయకపోవడం, బహిరంగ వేలంపాట కూడా తక్కువ రేటుకు పాడడంతో దీనిని రద్దు చేశారు. కబేళా వేలంపాటను అబీబ్ ఖురేషి రూ.90 వేలకు ఆన్‌లైన్ టెండర్ ద్వారా దక్కించుకున్నారు. మేనేజర్ ప్రసాద్, ఆర్‌వో రవీందర్, ఆర్ఐ చందు పాల్గొన్నారు.

అశ్వాపురం, మార్చి 28: అశ్వాపురంలో వారపు సంత వేలం పాటను అధికారులు శుక్రవారం నిర్వహించారు. పాటను రూ.5.80లక్షలకు కుంజా ప్రసాద్ దక్కించుకున్నారు. ఆయనకు ఏప్రిల్ 1 నుంచి వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు సంత నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తామని ఎంపీడీవో గంటా వరప్రసాద్ తెలిపారు. పంచాయతీ అబ్జర్వర్ ప్రేమలత, కార్యదర్శి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట, మార్చి 28: దమ్మపేట పంచాయతీ కార్యాలయంలో సంత వేలం పాటను శుక్రవారం ఎంపీడీవో రవీందర్‌రెడ్డి నిర్వహించారు. రూ.96వేలకు దమ్మపేటకు చెందిన మీసాల పాండు దక్కించుకున్నారు. ఎంపీవో రామారావు, కార్యదర్శి కేశవరెడ్డి పాల్గొన్నారు.

సంత వేలం వాయిదా

బూర్గంపహాడ్, మార్చి 28: మండలంలోని మోరంపల్లిబంజర్ పంచాయతీ కార్యాలయంలో సంత వేలం పాటను అధికారులు శుక్రవారం నిర్వహించారు. తగిన మద్దతు రాకపోడంతో వేలం పాటను వాయిదా వేశారు. డీఎల్‌పీవో సుధీర్, ఇన్‌చార్జ్ ఎంపీవో బాలయ్య, కార్యదర్శి భవాని పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా బదిలీపై వివాదం

స్థానికులకే అవకాశం ఇవ్వాలంటూ మహిళల ఆందోళన


అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి ఆందోళన చేస్తున్న మహిళలు

జూలూరుపాడు, మార్చి 28: జూలూరుపాడు మండలంలో అధికారులు నిర్వహించిన అంగన్‌వాడీ ఆయా బదిలీ స్థానికంగా శుక్రవారం ఆందోళనకు దారితీసింది. మండలంలోని వెంగన్నపాలెం అంగన్‌వాడీ సెంటర్-2లో ఆయా పోస్టు ఖాళీగా ఉండడంతో అధికారులు 2018లో దరఖాస్తులు ఆహ్వానించారు. జూలూరుపాడు పంచాయతీ కోయకాలనీకి చెందిన కురం వరలక్ష్మి అనే మహిళ తన ఓటరు గుర్తింపు కార్డును వెంగన్నపాలెం గ్రామానికి మార్చుకొని ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. సర్టిఫికెట్లు పరిశీలించిన అధికారులు ఆమెను ఆయాగా ఎంపికచేసి నియామకపత్రం అందజేశారు. అప్పటి నుంచి ఆమె వెంగన్నపాలెంలోనే విధులు నిర్వర్తిస్తోంది. కాగా, ఇటీవల సొంత గ్రామాలకు బదిలీపై సిబ్బంది వెళ్లవచ్చని నోటిఫికేషన్ వెలువడింది. అయితే, జూలూరుపాడు అంగన్‌వాడీ-2 సెంటర్‌లో ఆయా పోస్టు ఖాళీగా ఉండడంతో వరలక్ష్మి ఇక్కడికి బదిలీపై వచ్చేందుకు దరఖాస్తు చేసుకుంది. దీంతో అధికారులు ఆమెను బదిలీ చేశారు. అయితే, వేరే గ్రామానికి చెందిన మహిళను ఇక్కడికి ఎలా బదిలీ చేస్తారంటూ జూలూరుపాడు పంచాయతీలోని కోయకాలనీకి చెందిన మహిళలు అధికారులను ప్రశ్నించారు. కోయకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ మీటింగ్ ఉందని తెలుసుకున్న గ్రామస్తులు.. కేంద్రానికి తాళం వేసి తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. స్థానికులకే ఆయా పోస్టు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీడీపీవో సలోమీ ఆందోళనకారుల వద్దకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. కోయకాలనీకి చెందిన కురం వరలక్ష్మి వెంగన్నపాలెంగ్రామ నివాసిగా విధుల్లో చేరిందని స్పష్టం చేశారు. తిరిగి ఈ గ్రామానికి బదిలీపై పంపడం ఏంటని ప్రశ్నించారు. స్థానికంగా ఉన్న వారికే ఆయా పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సీడీపీవో స్పందిస్తూ.. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తామని మహిళలకు హామీ ఇచ్చారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

పాల్వంచ రూరల్, మార్చి 28: పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో కెరియర్ గైడెన్స్ సెల్, జిల్లా ఉపాధి కల్పన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు పాక్స్‌కాన్, భారత్ బయోటెక్, టెక్ ష్యూర్ ఇన్‌స్పెక్షన్ సర్వీస్, బజాజ్ ఫైనాన్స్ కంపెనీలు హాజరయ్యాయి. 150 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కంపెనీల బాధ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ మాట్లాడుతూ.. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీలు వేతనంతోపాటు ఉచిత రవాణా, భోజన సదుపాయాలు కల్పిస్తున్నాయని అన్నారు. కోటగిరి రాంబాబు, మాధవి, పొట్లపువ్వు శ్రీనివాస్, పారెల్లి శ్రీనివాస్, రమేశ్, డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో 'బీటీపీఎస్'కు తృతీయ స్థానం

మణుగూరు టౌన్, మార్చి 28: చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్‌లో మూడు రోజులపాటు జరిగిన టీజీ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. బీటీపీఎస్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ జట్టు సభ్యులు శుక్రవారం బీటీపీఎస్ సీఈ బిచ్చన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఆయన అభినందించారు. ఎస్ఈ (అడ్మిన్) పార్వతి, డీఈ మురళీకృష్ణ, సెక్రటరీ కల్తీ నరసింహారావు, జట్టు మేనేజర్ వెంకట్, కెప్టెన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి

మాట్లాడుతున్న లక్ష్మీనారాయణమ్మ

ములకలపల్లి, మార్చి 28: రైతులు/ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడి వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించాలని జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ కోరారు. వారు శుక్రవారం రైతులతో సమావేశమయ్యారు. వివిధాంశాలపై చర్చించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రవికుమార్ మాట్లాడుతూ.. వనరులను పరిమితంగా ఉపయోగించుకుంటూ వివిధ రకాల తోటలు, కూరగాయల సాగుతో లాభాలు పొందవచ్చని చెప్పారు. అశ్వారావుపేట డివిజన్‌లోని వ్యవసాయ స్థితిగతులను వివరించారు. కేవీకే శాస్త్రవేత్త నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలోని నేలలకు అనువైన రకాలు, వివిధ పంటల వైవిధ్యీకరణ దిశగా రైతులు ముందుకు అడుగులు వేయాలని అన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శివ, మండల వ్యవసాయ అధికారి అరుణ్‌బాబు, దమ్మపేట వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

దుకాణాలను తనిఖీ చేస్తున్న బాబురావు

చంద్రుగొండ, మార్చి 28: ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.బాబురావు కోరారు. మండలంలోని విత్తన, ఎరువుల విక్రయ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రైతులతో ఆయన మాట్లాడుతూ.. యాసంగిలో 63వేల ఎకరాల్లో వరిని రైతులు సాగు చేస్తున్నారని అన్నారు. యూరియా కొరత ఎక్కడా లేదని చెప్పారు. ఆయిల్ పామ్ సాగులో ఎస్సీ, ఎస్టీ రైతులకు పూర్తి సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ ఇస్తున్నట్లు తెలిపారు. స్టాక్ బోర్డులు ప్రదర్శించాలని, రికార్డులు నిర్వహించాలని దుకాణాల నిర్వాహకులను ఆదేశించారు. మండల వ్యవసాయ శాఖాధికారి వినయ్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

అశ్వారావుపేట, మార్చి 28: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని భీమునిగూడెం గ్రామస్తుడు యర్రం నరసింహారావు(55) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఏడాది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. రోజంతా కష్టపడగా వచ్చిన కూలీ డబ్బును మద్యానికి ఖర్చు చేస్తున్నాడు. దీంతో, మద్యం మానేయాలని అతడిని భార్య శారద గురువారం మందలించింది. వారిద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. క్షణికావేశానికి లోనైన నరసింహారావు ఇంటి వద్దనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అతడు అక్కడే శుక్రవారం మృతి చెందాడు. ఆయన భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై యయాతి రాజు దర్యాప్తు చేస్తున్నారు.

'అందరి సహకారంతో ఆరోగ్య సభలు విజయవంతం'

కొత్తగూడెం టౌన్, మార్చి 28: ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ఇటీవల నిర్వహించిన ఆరోగ్య మహాసభలు అందరి సహకారంతో విజయవంతమయ్యాయని నిర్వాహకులు పేర్కొన్నారు. స్థానిక ప్రకృతి ఆశ్రమంలో ఆశ్రమ గురువారం రాత్రి జరిగిన ఆశ్రమ సర్వసభ్య సమావేశంలో బాధ్యులు మాట్లాడారు. ప్రకృతి ఆరోగ్యంపైనా, పర్యావరణ పరిరక్షణపైనా కలెక్టర్‌తోపాటు ప్రతి ఒక్కరూ అందించిన స్ఫూర్తితో మరింత ముందుకెళ్తామని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంగం వెంకటపుల్లయ్యను సన్మానించారు. రిటైర్డ్ జీఎం శనగా వెంకటేశ్వర్లు, మొక్కల వెంకటయ్య, బీ.కృష్ణయ్య, ఏజీఎం గోనె శ్రీకాంత్, మన్‌కీ బాత్ మొక్కల రాజశేఖర్, కో ఆర్డినేటర్ సుగుణారావు, బంగారు శంకర్, దయానంద సాగర్, రాజేంద్రప్రసాద్, తుంపూడి శివ, రగణబాబు పాల్గొన్నారు.

'మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి'

లక్ష్మీదేవిపల్లి, మార్చి 28: మండలంలో మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని అనిశెట్టిపల్లి గ్రామస్తులు కోరారు. గ్రామంలో ఉన్న చెరువులో అక్రమంగా మట్టి తోలకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రైతుల పేర్లు చెప్పి రాత్రి సమయంలో మట్టి తోలకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు మట్టి తోలకాల ప్రాంతాన్ని, చెరువును గ్రామస్తులు కొందరు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు తక్షణమే స్పందించి ఈ మట్టి రవాణాను నిలిపివేయాలని, చెరువును రక్షించాలని కోరారు. అధికారులు చర్యలు తీసుకోకుండా చెరువు వద్ద ధర్నా చేస్తామని, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని అన్నారు.

శాశ్వత మార్కెట్ యార్డుగా మార్చాలంటూ వినతి

జూలూరుపాడు, మార్చి 28: జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్ యార్డుగా మార్చాలని కోరుతూ పలు గిరిజన సంఘాల నాయకుల కోరారు. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులకు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఏన్కూరు మార్కెట్ యార్డుకు అనుసంధానంగా జూలూరుపాడులో కొనసాగుతున్న సబ్ మార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్ యార్డుగా ఉన్నతీకరించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇదే విషయంపై రెవెన్యూ శాఖ మంత్రి కార్యాలయ ఇన్‌చార్జికి, అదనపు కలెక్టర్‌కు, డీఏవోకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'పాలకమండలి నియామకాన్ని పునఃసమీక్షించాలి'

పాల్వంచ, మార్చి 28: పెద్దమ్మగుడి దేవాలయం పాలకమండలి నియామకాన్ని పునఃసమీక్షించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, మండల అధ్యక్షుడు కొండం వెంకన్న గౌడ్ డిమాండ్ చేశారు. పాలకమండలిలో కేశవాపురం, జగన్నాథపురం గ్రామస్తులకు అవకాశం కల్పించాలని, ఎంపికల్లో సమతుల్యత పాటించాలని కోరారు. ఈ మేరకు పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమిటీ ఏర్పాటులో సమతుల్యత పాటించలేదని, అసెంబ్లీ ఎన్నికల నుంచి కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలకు సరైన ప్రాతినిథ్యం లభించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

అన్నపురెడ్డిపల్లి, మార్చి 28: మండలంలోని శాంతినగర్‌లో ఉపాధి హామీ పథకం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక శుక్రవారం పంపిణీ చేశారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం

టేకులపల్లి, మార్చి 28: మండలంలోని బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేకల జ్యోతిరాణి ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ముందస్తుగా, పాఠశాలలో శుక్రవారం జ్యోతిరాణి-శ్రీనివాస్ దంపతులను ఉపాధ్యాయులు, ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ తదితరులు సన్మానించారు. ఎంఈవో జగన్, ఇన్‌చార్జ్ హెచ్ఎం జరుపుల పద్మ, కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణాల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి, మార్చి 28: మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల పథకం పైలట్ పంచాయతీ ఊటుపల్లిలో ఇండ్ల నిర్మాణాలను జిల్లా హౌజింగ్ కార్పొరేషన్ పీడీ జి.శంకర్ శుక్రవారం పరిశీలించారు. ఎంపీడీవో మహాలక్ష్మి, ఏఈ రవి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ యాత్ర

ఆళ్లపల్లి, మార్చి 28: మండలంలోని బోడాయికుంట, నడిమిగూడెం పంచాయతీల్లో శుక్రవారం వాటర్‌షెడ్ యాత్ర సాగింది. రైతులు, గ్రామస్తులు స్వాగతించారు. ఎంపీడీవో దీరావత్ శ్రీను ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ వీరన్న, డాక్టర్ సంధ్యారాణి, ఎంపీవో సీతారామరాజు, ఏవో అనిల్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ వివేక్, ఏపీఎం రామ్‌కుమార్, ఏపీవో రఘునాథ్ పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శన

బూర్గంపహాడ్, మార్చి 28: పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యను నిరసిస్తూ ఆల్ పాస్టర్స్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో క్రిస్టియన్లు శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు శాంతి ప్రదర్శన నిర్వహించారు. నాయకులు భాస్కర్, డి.శ్రీను, తాటి మహేష్, పెద్దారావు, ఆశీర్వాదం, శెట్టి జాన్సన్ పాల్గొన్నారు.

నవమికి ఏర్పాట్లు

పర్ణశాల, మార్చి 28: వచ్చే నెల 6న పర్ణశాల దేవస్థానంలో జరగనున్న శ్రీరామనవమి తిరు కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. వీటిని తహసీల్దార్ అశోక్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు.

పెండింగ్ బిల్లుల విడుదలకు వినతి

పినపాక/ములకలపల్లి, మార్చి 28: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పీఆర్‌టీయూ నాయకులు శుక్రవారం పినపాక, ములకలపల్లి తహసీల్దారులకు వేర్వేరుగా వినతిపత్రం ఇచ్చారు. బూర సాంబమూర్తి, మణికుమార్, పాషా, సాబీర్‌పాషా, రవికుమార్, శ్రీకాంత్, పూర్ణ, సీతారాం, దస్రు, రామస్వామి, నాగమణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విలీనమైన రెండు యూనియన్లు

ఇల్లెందు, మార్చి 28: తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటర్ వర్కర్స్ ఫెడరేషన్, తెలంగాణ మోటర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి విలీన సభ శుక్రవారం ఇల్లెందులోని పెన్షనర్స్ భవన్‌లో జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు తొడేటి నాగేశ్వరరావు, ఏపూరి వీరభద్రం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ఎండి.రాసుద్దీన్, ఇ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ఇల్లెందు, మార్చి 28: ఇల్లెందులోని ప్రధాన రహదారిపై డివైడర్ల మధ్యలో అక్కడక్కడ యూ-టర్న్‌ల వద్ద వాహనాల రాకపోలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి నివారణకు మున్సిపల్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ శుక్రారం చర్యలు చేపట్టారు. మెయిన్ రోడ్‌లోని శిల్ప ఎలక్ట్రానిక్స్, సీతారామ థియేటర్ ఎదురుగాగల యూ-టర్న్‌లను మూసివేశారు. కేవలం పాదచారులు మాత్రమే వెళ్లేలా కొంచెం దారి ఉంచారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఇల్లెందు, మార్చి 28: ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రంలో 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలన్న డిమాండుతో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఏప్రిల్ 8న ధర్నా జరగనుంది. ఈ కార్యక్రమ ప్రచార పోస్టర్‌ను సీపీఐ-ఎంఎల్ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు, ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐ.కృష్ణ, ఎం.శ్రీనివాస్ తదితరులు శుక్రవారం స్థానిక భగత్‌సింగ్ సెంటర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు.

'వీకేవోసీని సింగరేణి కార్మికులతోనే నడపాలి'

రామవరం, మార్చి 28: ఏరియాలో నూతనంగా ప్రారంభం కానున్న వీకేవోసీని ప్రైవేట్ వ్యక్తులకు కాకుండా పూర్తిగా సింగరేణి ఉద్యోగులతోనే నడిపించాలని టీబీజీకేఎస్ నాయకులు కోరారు. గతంలో జీకేవోసీని నడిపించిన విధంగా ఓబీ, కోల్‌లతో నడిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీకేవోసీ మేనేజర్ మురళికి టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ శుక్రవారం వినతిపత్రం అందించారు. కార్మికుల వినతిని సీఎండీకి పంపించాలని కోరారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాటి చెట్టు పడి చిన్నారి మృతి

దుమ్ముగూడెం, మార్చి 29: తాటి చెట్టు పడడంతో చిన్నారి మృతిచెందింది. మండలంలోని కోయనర్సాపురంలో శుక్రవారం ఈ దుర్ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కోయనర్సాపురం గ్రామానికి చెందిన సోందు సుమలత, తన ఇంటి సమీపంలోగల ఎండిపోయిన తాటి చెట్టుకు నిప్పు పెట్టింది. దాని పక్కనే ఉన్న మామిడి చెట్టు కొమ్మలపై సుమలత కుమార్తె ప్రసన్నశ్రీ(3), మరో ఇద్దరు పిల్లలు ఆడుకుంటున్నారు. మండుతున్న తాటి చెట్టు విరిగి, పక్కనున్న మామిడి చెట్టు పక్కన పడింది. ఆ మామిడి చెట్టు కొమ్మల చివరన ఉన్న చిన్నారి ప్రసన్నశ్రీపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మిగతా ఇద్దరు చిన్నారులు తప్పించుకున్నారు. ప్రసన్నశ్రీని తల్లిదండ్రులు వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆ పాప అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.